
సాక్షి ఒడిశా

సోమవారం । 26 । మే । 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు
నగదు : రూ. 5,83,559
బంగారం : 1 గ్రాము 50 మిల్లీ గ్రాములు
వెండి : 62 గ్రాములు - భువనేశ్వర్/పూరీ



మొక్కలు నాటాలి

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని అధికారులు అన్నారు. జయపురంలో మొక్కలు నాటారు. - 8లో



నది ఒడ్డున మృతదేహం

పంగం నది ఒడ్డున మహిళ మృతదేహం లభ్యమైంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. - 8లో

న్యూస్‌రీల్

జల క్రీడల సమయంలో పడవ బోల్తా



బోటు బోల్తా ప్రమాద దృశ్యం

భువనేశ్వర్: పూరీ బీచ్‌లో ఆదివారం జల క్రీడల సందర్భంగా పర్యాటకులతో వెళ్తున్న స్పీడ్ బోట్ బోల్తా పడింది. సముద్రంలో బోల్తా పడటంతో పడవ కింద పర్యాటకులు చిక్కుకున్నారు. అదృష్టవశాత్తూ స్థానిక లైఫ్‌గార్డ్‌లు తక్షణమే స్పందించి ఘోర విపత్తు నివారించారు. పర్యాటకులను బోల్తా పడిన పడవ నుంచి రక్షించారు. లైఫ్‌గార్డ్‌లు సకాలంలో చర్య తీసుకోవడం వల్ల పెద్ద ప్రమాదం తప్పింది. ఈ సంఘటనతో జల క్రీడల కార్యకలాపాల భద్రతా చర్యలపై సర్వత్రా భయాందోళనల వ్యక్తం అవుతున్నాయి.

పరుపుల కార్ఖానాలో భారీ అగ్నిప్రమాదం



అగ్ని ప్రమాదంలో దగ్ధమైన కార్ఖానా

భువనేశ్వర్: స్థానిక మంచేశ్వర్ రైల్వే స్టేషన్ సమీపంలోని ఒక పరుపుల కార్ఖానాలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ దుర్ఘటనలో లక్షలాది రూపాయల విలువైన పదార్థాలు దగ్ధమయ్యాయి. మంటలు ఫ్యాక్టరీ అంతటా వ్యాపించడంతో లోపల నిల్వ చేసిన స్పాంజి, ప్లాస్టిక్, పత్తి, వస్త్రం వంటి పదార్థాలు దగ్ధమయ్యాయి. అగ్ని మాపక దళాలను మోహరించి మంటలు నివారించారు. అగ్నిప్రమాదానికి కారణం తెలియదు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది.

జైలు ఆవరణలో ఖైదీ ఆత్మహత్య

భువనేశ్వర్: కటక్ చౌద్వార్ జైలు సముదాయంలో ఖైదీ ఆత్మహత్య సంఘటన చోటు చేసుకుంది. ఈ ప్రాంగణంలో మామిడి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు అధికారులు తెలిపారు.మృతుడు కటక్ జిల్లా సమంతరాపూర్ గ్రామస్తుడు విష్ణు ప్రసాద్ స్వంయిగా గుర్తించారు. విష్ణు ప్రసాద్ స్వంయిగా మృతిపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. న్యాయం చేయాలని పోలీసు ఠాణాలో ఫిర్యాదు చేశారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

- రూ. 40 వేల జరిమానా



పట్టుబడిన ఇసుకతో వెళ్తున్న టిప్పర్

పర్లాకిమిడి: గజపతి జిల్లా కాశీనగర్ బ్లాక్ కురిగాం వద్ద ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను జిల్లా మైనింగ్ అధికారి దిపెన్ పోరిడా పట్టుకుని పర్లాకిమిడి ఆదర్శ పోలీసు స్టేషన్‌కు అప్పగించారు. పట్టుబడిన ఇసుక టిప్పర్‌కు మైనింగ్ లైసెన్సు కాగితాలు లేకపోవడంతో రూ. 40 వేలు జరిమానా విధించారు. అనేకసార్లు ఇసుక ట్రాక్టర్లు, టిప్పర్లు పట్టుబడుతున్నా వారిలో మార్పురావడం లేదని అధికారులు చెబుతున్నారు. ఒడిశా నుంచి ఆంధ్రప్రదేశ్‌కు రాత్రి వేళ ఇసుక రవాణా జరుగుతున్నట్టు జిల్లా మైనింగ్ అధికారులు చెబుతున్నారు. రోజూ వందలాది ఇసుక ట్రాక్టర్లు, టిప్పర్లు ఒడిశాలోని వంశధార నది నుంచి పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళానికి తరలిపోతున్నాయి.

పిడుగు పడి రెండు పశువులు మృతి



మృతి చెందిన పశువు

రాయగడ: పిడుగు పడి రెండు పశువులు మృతి చెందాయి. జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి నారాయణపూర్ పంచాయతీలోని పాడేయికొన గ్రామంలో ఈ ఘటన ఆదివారం సాయంత్రం జరిగింది. పంట పొలాల్లో పశువులు పచ్చిక మేస్తున్న సమయంలో వర్షం కురిసింది. దీంతో రెండు పశువులు చెట్టు కిందకు వెళ్లాయి. అదే సమయంలో పిడుగు పడడంతో అవి అక్కడికక్కడే మృతి చెందాయి. నారాయణపూర్ గ్రామానికి చెందిన గంగన్న కరడ్రక , పాడేయికొన గ్రామానికి చెందిన రవీంద్ర కద్రకలకు చెందిన రెండు పశువులుగా గుర్తించారు.

నీరు.. కన్నీరు



బిందెడు నీళ్ల కోసం మైళ్ల దూరం నడుచుకుంటూ వెళ్లి తీసుకువస్తున్న యువతులు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ సబ్ డివిజన్ పరిధి గుడారి పంచాయతీలో గల తొలొబొండా గుగుడ గ్రామం నీటి కోసం కన్నీరు పెడుతోంది. ఇక్కడ సుమారు 30 ఆదివాసీ తెగకు చెందిన 30 కుటుంబాలు నివసిస్తున్నాయి. అందరికీ ఒకే ఒక గొట్టపు బావి ఉండడంతో తాగునీటి సమస్యతో ప్రజలు విలవిలలాడిపోతున్నారు. బావి నుంచి నీరు తోడీ తోడీ భుజాలు అరిగిపోతున్నాయి. ఇంత తోడినా 10 నుంచి 12 బిందెలకు మించి రావడం లేదు. దీంతో వీరంతా గ్రామానికి 4 కిలోమీటర్ల దూరంలో గల నది నుంచి కలుషిత నీటిని తీసుకు వచ్చి దాన్ని వడగట్టి తాగునీటిగా వినియోగిస్తున్నారు. నీటి సమస్యపై చాలా సార్లు అధికారులను కలిసినా ప్రయోజనం లేకపోయింది. అసలే వేసవి కాలం కావడంతో మండుటెండలో నది నుంచి నీటిని తీసుకురాలేకపోతున్నామని, కూలి పనులు మానుకుని నీటి కోసం వెళ్లాల్సి వస్తోందని అంటున్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం చొరవ తీసుకుని తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

పరిష్కారమే లేదా..?



గ్రామంలో తాగునీటి సమస్య విలయతాండవం చేస్తోంది. అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేదు. గొట్టపు బావి వేసినా లాభం లేదని అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. మరి మా గ్రామంలో తాగునీటి సమస్యకు పరిష్కారమే లేదా..?

– సనొబుడు టుకురుక, గ్రామస్తుడు

చొరవ తీసుకోవాలి



ప్రభుత్వం చొరవ తీసుకుని తాగునీటి సమస్య పరిష్కరించాలి. నీటి కోసం మేం మైళ్ల కొద్దీ దూరం నడవాల్సి వస్తోంది. రెక్కాడితే గానీ డొక్కాడని జీవితాలు మావి.

– కలియా టుకురుక, గ్రామస్తుడు

ఎవరూ పట్టించుకోవడం లేదు



ఇంటికి అతిథి వచ్చినా మంచినీరు ఇవ్వలేకపోతున్నాం. కనీసం తాగేందుకు గ్లాసుడు నీళ్లు ఇవ్వడానికైనా అవ్వడం లేదు. మమ్మల్ని ఎవరూ పట్టించుకోవడం లేదు.

– సాహేబ్ టుకురుక, గ్రామస్తుడు

ఇక్కట్లు తీరడం లేదు



ఎప్పటి నుంచో మా గ్రామంలో తాగునీటి సమస్య ఉంది. మహిళలమంతా కలిసి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా మాకు ఇక్కట్లు తీరడం లేదు. బిందెడు నీటి కోసం మైళ్ల కొద్దీ కాలినడకన వెళుతున్నాం.

– గగేరి టుకురుక, గ్రామస్తురాలు

పంచాయతీ ఎన్నికల్లో సత్తా చాటండి



మాట్లాడుతున్న పీసీసీ చీఫ్ భక్త చరణ్ దాస్ తదితరులు

- పీసీసీ అధ్యక్షుడు భక్త చరణ్ దాస్

కొరాపుట్: రానున్న మూడంచెల పంచాయతీ ఎన్నికలలో కార్యకర్తలు సత్తా చాటాలని పీసీసీ అధ్యక్షుడు భక్త చరణ్ దాస్ పిలుపునిచ్చారు. ఆదివారం కొరాపుట్ జిల్లా పర్యటనలో భాగంగా మీడియాతో మాట్లాడారు. ఎన్నికలలో కష్టపడి తమ పని తీరు చూపించుకోవాలన్నారు. ఆ తర్వాత ఎంపీ, ఎంఎల్ఎ టిక్కెట్ల కోసం రావాలన్నారు. రానున్న రోజులలో కాంగ్రెస్ పార్టీ టిక్కెట్‌పై ఎంపీ, ఎంఎల్ఏగా పోటీ చేయాలనుకునే వారికి ఇది మంచి అవకాశం అన్నారు. క్షేత్ర స్థాయిలో పని చేయకుండా లాబీయింగ్ చేసి టిక్కెట్ పొందాలంటే కుదరదన్నారు. ఇప్పటి నుంచే ప్రజల్లోకి వెళ్లి కష్టపడాలని భక్త చరణ్ దాస్ కోరారు. అంతకుముందు పీసీసీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు మీనాక్షి వాహిని పతితో చర్చలు జరిపారు. అతని వెంట కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పరిశీలకుడు అజయ్ లల్లూ, కొరాపుట్ ఎంపీ సప్త గిరి ఉల్క, సీఎల్‌పీ నాయకుడు రాం చంద్ర ఖడం, ఎమ్మెల్యేలు మంగులు కిలో, పవిత్ర శాంత, అప్పల స్వామి కద్రకలు ఉన్నారు.



మీనాక్షి బాహిని పతి తో చర్చలు జరుపుతున్న భక్త చరణ్ దాస్

పార్టీ శ్రేణులతో పీసీసీ చీఫ్ భేటీ



పార్టీ నేతలతో చర్చిస్తున్న పీసీసీ చీఫ్ భక్త చరణ దాస్

జయపురం: రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు భక్త చరణ దాస్ శనివారం సాయంత్రం కొరాపుట్ వచ్చారు. పొట్టగి ఎమ్మెల్యే, విధాన సభలో కాంగ్రెస్ శాసనసభా పక్ష నాయకులు రామ చంధర కడమ్ కుమార్తె వివాహానికి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. అనంతరం కొరాపుట్ సర్క్యూట్ హౌస్‌లో జిల్లా పార్టీ నాయకులతో సమావేశమై తాజా రాజకీయ పరిస్థితిపై చర్చించినట్లు తెలిసింది. సమావేశంలో రాష్ట్ర మహిళా కాంగ్రెసస్ అధ్యక్షురాలు మీణాక్షీ బాహిణీపతి, మల్కన్‌గిరి మాజీ ఎమ్మెల్యే నిమ్మయిచరణ సర్కార్, రాష్ట్ర కాంగ్రెస్ పరిశీలకులు అజయ లల్లూ, లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పవిత్ర శాంత తదితరులు పాల్గొన్నారు. భక్త చరణ దాస్ పీసీసీ అధ్యక్షులుగా నియమితులైన తరువాత మొదటి సారిగా కొరాపుట్ వచ్చిన సందర్భంగా ఆయనకు ప్రార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు.

బీజేపీకి పెరిగిన ఆదరణ

- జిల్లా అధ్యక్షుడు గోపీ ఆనంద్



మాట్లాడుతున్న గోపీఆనంద్, పక్కనే బసంత్ తదితరులు

రాయగడ: రాష్ట్రంలో బీజేపీకి ప్రజల నుంచి ఆదరణ పెరిగిందని.. దీంతో ఇతర పార్టీలు తమ ఉనికిని కోల్పోయే స్థితికి చేరుకున్నాయని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గోపి ఆనంద్ అన్నారు. స్థానిక సిరికోనలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మిశ్రణ పర్వం కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. డబల్ ఇంజిన్ సర్కారుతో రాష్ట్రం భవిష్యత్‌లో ఎంతో అభివృద్ధి చెందుతోందన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రజా సంక్షేమ పథకాలే రాష్ట్రంలో బీజేపీ విజయానికి దోహదపడ్డాయని అన్నారు. ఆయన హయాంలో ప్రజలు అన్ని రంగాల్లో అభివృద్ధిని చూడగలుగుతున్నారని చెప్పారు. మోదీ ఆశయాలకు అనుగుణంగా ఎంతోమంది బీజేపీలో చేరుతున్నారని చెప్పారు. అనంతరం సమితి పరిధిలోని గుమ్మ పంచాయతీకి చెందిన ఆరుగురు వార్డు సభ్యులు బీజేపీలో చేరారు. అలాగే మరో 50 మంది బీజేడీ, కాంగ్రెస పార్టీల కార్యకర్తలు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి జిల్లా అధ్యక్షులు కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు బసంత కుమార్ ఉలక, జిల్లా యువమోర్చ అధ్యక్షులు ఉమేస్ ఖోషల, ఉపాధ్యక్షులు ప్రీతమ్ నాయక్, అశ్విని కొంచాడ, రజత్ మదల పాల్గొన్నారు.

కృష్ణచంద్ర గజపతికి ఘనంగా నివాళి



పాతబస్టాండు వద్ద కృష్ణచంద్రగజపతి విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఏడీఎం ఫాల్గుణి మరిుు

పర్లాకిమిడి: స్వతంత్ర ఉత్కళ రాష్ట్ర పోరాట యోధుడు పర్లాకిమిడి మహారాజా కృష్ణచంద్ర గజపతి నారాయణ దేవ్ 52వ సంస్మరణ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పాతబస్టాండు వద్ద ఆయన విగ్రహం వద్ద పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుమ్మరి వీధి వద్ద గజపతి మహారాజుల శ్మశాన వాటిక వద్దకు వెళ్లి కృష్ణచంద్రగజపతి సమాధి వద్ద పుష్పమాలలు వుంచి శ్రద్ధాంజలి ఘటించి నినాదాలు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు జిల్లా మేజిస్ట్రేట్ ఫాల్గుణి మరిుు హాజరు కాగా పురపాలక ఈఓ లక్ష్మణ ముర్ము, జిల్లా సాంస్కృతిక శాఖా అధికారి అర్చనా మంగరాజ్, డీపీఆర్ఓ ప్రదిప్తగురుమయి ఉత్కళ హితేషినీ అధ్యక్షులు పూర్ణచంద్ర మహాపాత్రో, బీబీ మహంతి తదితరులు పాల్గొన్నారు.



మహారాజా గజపతి సమాధి వద్ద ఏడీఎం



మహారాజా కృష్ణచంద్రగజపతి నారాయణ దేవ్ స్మారక సమాధి వద్ద అంజలి ఘటిస్తున్న ప్రభుత్వ అధికారులు, స్థానికులు

• మంటల్లో కంటైనర్..!



మంటల్లో చిక్కుకున్న కంటైనర్

ఒడిశాలోని 16వ నంబర్ జాతీయ రహదారిపై వెళ్తున్న కంటైనర్‌లో అకస్మాతుగా మంటలు చెలరేగాయి. సిములియా పోలీస్ ఠాణా సమీపంలోని 16వ నంబర్ జాతీయ రహదారి వంతెనపై ఆదివారం ఈ సంఘటన చోటు చేసుకుంది. షార్ట్ సర్క్యుట్ కారణంగా మంటలు చెలరేగాయని భావిస్తున్నారు. సమయ స్ఫూర్తితో డ్రైవర్ సురక్షితంగా తప్పించుకుని ప్రాణాలతో బతికి బయటపడ్డాడు. భారీగా మంటలు వ్యాపించడంతో స్థానికులు ఆందోళన చెందారు. – భువనేశ్వర్

బీజేపీ కౌన్సిలర్ ఇంట్లో చోరీ



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం



దుండగులు విరగ్గొట్టిన అలమరాలు

రాయగడ: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు బీజేపీ కౌన్సిలర్ అందవరపు వాణిశ్రీ ఇంట్లో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండగులు ఇంట్లోకి చొరబడి బీరువాలను విరగ్గొట్టి అందులో ఉన్న 70 వేల రూపాయల నగదును దొంగిలించారు. సమాచారం తెలుసుకున్న సదరు పోలీసులు సంఘటనా స్థలాన్ని ఆదివారం ఉదయం పరిశీలించారు. క్లూస్ టీంతో ఆధారాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం.. ఈ నెల 21వ తేదీన కౌన్సిలర్ వాణిశ్రీ, ఆమె భర్త ఆనంద్‌తో సహా కుటుంబ సభ్యులు బద్రీనాథ్ తీర్థ యాత్రలకు వెళ్లారు. ఇదే అదనుగా భావించిన దుండగులు ఇంట్లో ఎవరూ లేరని తెలుసుకుని దొంగతనానికి పాల్పడ్డారు. కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ కెమెరాల ద్వారా దుండగులను పట్టుకుంటామని చెబుతున్నారు. ఇదిలా ఉండగా ఈ నెల 17వ తేదీన స్థానిక రాణిగుడఫారం డీఎఫ్‌వో కార్యాలయం రెండో లైన్‌లో కూడా దొంగతనం జరిగింది. పట్టణంలో తరచూ ఇటువంటి సంఘటనలు చోటు చేసుకుంటుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

రథ నిర్మాణ పనులకు కలప కొరత



పూరీ చేరుతున్న కలప దుంగలు

భువనేశ్వర్: పూరీలో శ్రీ జగన్నాథుని రథయాత్ర ప్రపంచ ప్రఖ్యాతం. మూడు వేర్వేరు రథాలపై బలభద్రుడు, దేవీ సుభద్ర, శ్రీ జగన్నాథుడు, సుదర్శనుని చతుర్థా మూర్తులు శ్రీ మందిరం నుంచి గుండిచా మందిరానికి తరలివెళ్లడం యాత్ర ప్రాధాన్యత. ఈ సందర్భంగా ఏటా 3 కొత్త రథాలు తయారు చేస్తారు. చక్రాల తయారీ ముగింపు దశకు చేరుకుంటుండగా ఇరుసు, స్తంభాల పనులు చేపట్టారు. ఇలా అంచెలంచెలుగా ముందుకు సాగాల్సిన రథాల తయారీ పనులకు అంతరాయం ఏర్పడింది. అవసరమైన సామగ్రి లేకపోవడం వల్ల పనులు కుంటుపడ్డాయి. ముఖ్యంగా ప్రతి రథం కేంద్ర ఇరుసుకు అవసరమైన 40 అడుగుల ధవురా కలప దూలాలు కొరవడ్డాయి. రథంలో ఇరుసు అత్యంత కీలకమైన దృఢ భాగం. బలమైన ధవురా దూలాలు చాలా ముఖ్యమైన వనరు. దీని కొరతతో అంచెలంచెలుగా కొనసాగించాల్సిన పనులకు గండి పడింది. మరో వైపు సహజ, అసన్ కలప సరఫరా కూడా మందగించింది. మూడు రథాల పైఅంతస్తుల నిర్మాణానికి ఆధారంగా స్తంభాల తయారీలో ఈ కలప అత్యవసరం. మూడు రథాల్లో 27 స్తంభాల తయారీ కోసం ఈ కలప అవసరం. ఈ పరిస్థితిని పర్యవేక్షక వర్గం అంగీకరించింది. కలప కొరతను ఒక ముఖ్యమైన అడ్డంకిగా పేర్కొన్నారు.

కలప సత్వర రవాణా కోసం నయాగఢ్ అటవీ శాఖ అధికారులతో సంప్రదించారు. త్వరలో అవసరమైన కలప అంచెలంచెలుగా చేరుతుందని అటవీ విభాగం అధికార వర్గాలు భరోసా ఇచ్చాయి. రథాలలో కేంద్ర ఇరుసులు ప్రధాన భాగాలు. ఇరుసుల నిర్మాణానికి ధవురా కలప చాలా అవసరం. ఈ కలప చేరాల్సి ఉంది. ఫలితంగా నిర్మాణ పనులు ప్రభావితం అయ్యాయని నందిఘోష రథం ప్రధాన వడ్రంగి సేవకుడు విచారం వ్యక్తం చేశారు. సహజ, అసన్ కలప కొరత కారణంగా రథాల స్తంభం పనులు ప్రభావితం అయ్యాయి. ఈ కీలకమైన నిర్మాణ పనులను చకచకా చేపట్టడానికి వాతావరణం అనుకూలంగా ఉంది. అవసరమైన కలప కొరత కారణంగా పనులు కొనసాగడం లేదని వివరించారు. కలప అంచెలంచెలుగా రవాణా అవుతోంది. ఆదివారం నుంచి క్రమంగా చేరుతుందని శ్రీ మందిరం ప్రధాన పాలన అధికారి డాక్టరు అరవింద కుమార్ పాఢి తెలిపారు. రథాల నిర్మాణ పనులు యథాతథంగా వేగవంతం అవుతాయని ఆయన అభయం ఇచ్చారు. గత ఏడాది రథాల తయారీ పనుల తర్వాత 51 కలప దుంగలు మిగిలి ఉన్నాయి. ఈ లెక్కన మరో 814 కలప దుంగలు అవసరం ఉన్నాయి. వాటిలో గత వారం నాటికి 499 కలప దుంగలు కటక్ ఖపురియా కలప మిల్లు, శ్రీక్షేత్రం రథ తయారీ ప్రాంగణానికి చేరినట్లు తెలిపారు. బౌధ్ అటవీ ప్రాంతం నుంచి 40 అడుగుల పొడవైన 32 దూలాలు ఆది వారం చేరాయి. వీటిలో 22 అసన, 10 ధవురా చెక్కలు ఉన్నట్లు పేర్కొన్నారు. మరో వైపు రథాలకు అమర్చే తాత్కాలిక కాటి బాట చారుమళ్ల కోసం తాటి మట్టలు ఢెంకనాల్ నుంచి రానున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

కృష్ణచంద్ర గజపతికి ఘన నివాళి

పర్లాకిమిడి: స్థానిక రాజగురు వీధిలో బాలముకుంద కేంద్రం ఆధ్వర్యంలో నవజీవన్ అనాథ ఆశ్రమంలో స్వర్గీయ కృష్ణచంద్ర గజపతి నారాయణ దేవ్ 52వ సంస్మరణ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఒడిశా రాష్ట్రం ఏర్పాటు కోసం గజపతి నారాయణ దేవ్ చేసిన పోరాటాన్ని బాలముకుంద కో ఆర్డినేటర్ నిత్యానంద చౌదరి వివరించారు. అనంతరం కృష్ణచంద్ర గజపతి నారాయణ దేవ్ చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి మధుస్మితా సింగ్, నవజీవన్ ట్రస్టు ఇన్‌చార్జి మేనేజర్ ఎస్.వి.రమణ, పాల్గొన్నారు.

వలస కూలీ అదృశ్యం


సమరేష్ (ఫైల్)

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి సమితి తామ్సా పంచాయతీ ఎం.వి-48 గ్రామానికి చెందిన సమరేష్ మండాల్ (37) రెండు నెలల క్రితం బెంగుళూరుకు వలస (కూలి పనుల కోసం) వెళ్లాడు. గతవారం రోజులుగా కనిపించడం లేదు. ఫోన్ కూడా అవడం లేదు. దీంతో కుటుంబ సభ్యులకు తోటి కూలీలు సమాచారం చేరవేశారు. కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఆదివారం మల్కన్‌గిరి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మలకన్‌గిరి ఐఐసీ రీగాన్ కీండో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పీజీ సెట్ దరఖాస్తుల స్వీకరణ గడువు పూర్తి

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్రంలోని 17 విశ్వవిద్యాలయాల్లో పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశానికి ఏపీ పీజీసెట్ – 2025 దరఖాస్తుల స్వీకరణ గడువు ఆదివారంతో ముగింది. ఏపీ పీజీ సెట్ ద్వారా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ప్రవేశాలు కల్పిస్తారు. మార్చి 31 నుంచి దరఖాస్తులు స్వీకరణ మొదలైన సంగతి తెలిసిందే. ఈ నెల 30 నుంచి హాల్ టికెట్ల డౌన్‌లోడ్‌కు అవకాశం కల్పించారు. జూన్ 9 నుంచి 13వ తేదీ వరకు ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహిస్తారు.

సాహితీమూర్తి పులఖండం

గార: గొప్ప సాహితీమూర్తి డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు అని గురజాడ విద్యాసంస్థల అధినేత జి.వి.స్వామినాయుడు అన్నారు. ఆదివారం గార మండలం వాడాడ జంక్షన్‌లోని కల్యాణ మండపంలో విద్వాన్ బంకుపల్లి రమేష్‌శర్మ అధ్యక్షతన జరిగిన పులఖండం సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో గొప్ప కార్యక్రమాలు నిర్వహించిన వ్యక్తి మనమధ్య లేకపోవడం బాధాకరమన్నారు. ఐఎస్‌వో, నాక్ వంటి సంస్థల గుర్తింపు వెనుక ఆయన కృషి ఉందన్నారు. అనంతరం కరస్పాండెంట్ రంగారావు, వైస్ ప్రిన్సిపాల్ కె.వి.సత్యనారాయణ, డాక్టర్ ఎం.కృష్ణ, విశ్రాంత డీఎస్పీ భార్గవరావు నాయుడు, డాక్టర్ డి.విష్ణుమూర్తి, మేజర్ వంగ మహేష్, ఉపనిషన్మందిరం కార్యదర్శి నిష్టల నరసింహమూర్తి మాట్లాడుతూ పులఖండంతో గల అనుబంధాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో గురజాడ సంస్థల ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

శ్రీకాకుళం క్రైమ్ : నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా ఉన్న పాత నేరస్థులు, సస్పెక్ట్ షీటర్లకు వివిధ పోలీస్‌స్టేషన్ల సీఐలు, ఎస్‌ఐలు ఆదివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ప్రస్తుతం జిల్లాలో క్రికెట్ బెట్టింగ్ జోరుగా సాగుతుండటంతో పాటు పేకాట శిబిరాలు ఎక్కడ పడితే అక్కడ నడుస్తుండటంతో వారం వ్యవధిలో రెండోసారి కౌన్సిలింగ్ ఇచ్చారు.ఎస్పీ ఆదేశాలతో టాస్క్‌ఫోర్స్ దాడులు సైతం ముమ్మరం అయ్యాయి. జిల్లాకేంద్రంలోని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో సీఐ పైడపునాయుడు షీటర్లకు అవగాహన కల్పించారు. చెడు అలవాట్లకు స్వస్తి చెప్పి సత్ప్రవర్తనతో మెలగాలని, అందుకు భిన్నంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదన్నారు.

సేవలు మరింత విస్తృతం చేయాలి

శ్రీకాకుళం కల్చరల్: సత్యసాయి సంస్థల సేవలు మరింత విస్తృతం కావాలని రాష్ట్ర సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు రఘుపాత్రుని లక్ష్మణరావు కోరారు. జిల్లా కేంద్రంలోని బ్యాంకర్స్ కాలనీలో సత్యసాయి మందిరంలో జిల్లా స్థాయి సత్యసాయి సేవా సంస్థల పదాధికారులు, కన్వీనర్లతో ఆదివారం సమావేశం నిర్వహించారు. నారాయణసేవ, గ్రామ సేవా మహాయజ్ఞం, కోటి మొక్కల పెంపకం, రిమ్స్, టెక్కలి ప్రభుత్వ ఆస్పత్రులలో నిర్వహిస్తున్న నిత్య నారాయణ సేవలపై సమీక్షించారు. కార్యక్రమంలో సమితి, భజన మండలి కన్వీనర్లు, సమన్వయకర్తలు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని కిల్లిపాలెంలో ఆదివారం ఓ గృహంలో పేకాడుతున్న ఆరుగురిని శ్రీకాకుళం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.79,700 నగదు స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు నాలుగు బైక్‌లు, మూడు సెల్‌ఫోన్లు కుడా స్వాధీనం చేసుకున్నారు. కాగా, శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలో ఇటీవల కాలంలో పేకాట, బెట్టింగ్ వంటి వ్యవహారాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. రూరల్ పోలీసులు మాత్రం వీటిపై నోరు మెదపడం లేదు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు ముందస్తుగా సమాచారం సేకరించడంతో పాటు నేరస్తుల కదలికలు పసిగట్టడం, పేకాడుతున్న వారిని పట్టుకోవడంలో దూకుడుగా ఉంటున్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలి

మొక్కాపుట్ ప్రాంతంలో పర్యటిస్తున్న మహిళా సంఘాల సభ్యులు, అధికారులు



జయపురం: ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలని వక్తలు అన్నారు. కేంద్ర ప్రభుత్వ అమృత మిత్ర పథకంలో ప్రతి మహిళకు ఒక చెట్టు కార్యక్రమం ఆదివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా స్వయం సహాయక గ్రూపు మహిళలకు మొక్కలు ఎలా నాటాలి అనే విషయంపై శిక్షణ ఇచ్చారు. జయపురం సమితి మొకాపుట్, గోవర్ధన ముండ ప్రాంతంలో 400 మొక్కలు నాటేందుకు లక్ష్యం పెట్టుకున్నారు. అంతే కాకుండా పట్టణ ప్రాంతంలోని పార్కులు, ఖాళీ ప్రదేశాల్లో నాటిన మొక్కలకు నీళ్లు పోసి వాటిని పరిరక్షించేందుకు స్వయం సహాయక గ్రూపు మహిళలను అమృత మిత్ర పథకంలో మమేకం చేసినట్లు నిర్వాహక అధికారి, మున్సిపాలిటీ ఇంజినీర్ అజయ జాని వెల్లడించారు. మొక్కలు నాటి వాటిని ఎలా పర్యవేక్షించాలి, నీరు, మట్టి, యాజమాన్యం, పార్కులలో మొక్కలను ఎలా పెంచాలి మొదలగు విషయాలపై మహిళలకు ఈ కార్యక్రమంలో శిక్షణ ఇచ్చారు. స్వయం సహాయక గ్రూపుల మహిళలను మొకాపుట్, గోవర్ధనముండ ప్రాంతాలకు తీసుకెళ్లి పరిసర ప్రాంతాలను చూపించి ఎక్కడెక్కడ మొక్కలు నాటాలో చూపించారు. మొక్కాపుట్ ప్రాంతంలో 300, గోవర్ధనముండ ప్రాంతంలో 100 మొక్కలు నాటాలని సూచించారు. వర్షాలు పడక ముందే మొక్కలు నాటాలని.. నాటిన మొక్కలు ఎనిమిది అడుగులు పెరిగేంత వరకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. సక్రమంగా మొక్కలను సంరక్షించిన వారికి ప్రభుత్వం నగదు బహుమతి అందజేస్తోందన్నారు. అలాగే రాష్ట్ర స్థాయిలో ఎస్‌హెచ్‌జీ మహిళ గ్రూపు ఉత్తమంగా ఎంపిక అవుతుందో ఆ గ్రూపునకు రాష్ట్ర ప్రభుత్వం బహుమతి ఇచ్చి సన్మానిస్తోందని మున్సిపల్ ఇంజినీర్ అజయ జాని వెల్లడించారు. కార్యక్రమంలో అమృత యోజన నోడల్ అధికారి సుబ్రత్ సింగ్, జిల్లా నోడల్ అధికారి మధుస్మిత ప్రహరాజ్ పాల్గొన్నారు.

నాన్ గెజిటెడ్ ఉద్యోగులందరికీ ఆరోగ్య బీమా వర్తింపు

జయపురం: నాన్ గెజిటెడ్ ఉద్యోగులందరికీ ఆరోగ్య బీమా పథకంతో పాటు మూడు ప్రధాన డిమాండ్లను అమలు చేయాలని నాన్ గెజిటెడ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ డిమాండ్ చేసింది. ఆదివారం స్థానిక యాదవ భవన ప్రాంగణంలో ఒడిశా రాష్ట్ర నాన్ గెజిటెడ్ కర్మచారీ సమన్వయ సమితి కొరాపుట్ జిల్లా శాఖ, ఒడిశా అమలాసంఘ కొరాపుట్ జిల్లా శాఖ, ఒడిశా మాధ్యమిక ఉద్యోగ సంఘం కొరాపుట్ జిల్లా శాఖలు సంయుక్తంగా నిర్వహించిన సమావేశవానికి శోభిభూషణ దాస్ అధ్యక్షత వహించారు. సమావేశంలో రాష్ట్ర అమలా సంఘం మాజీ అధ్యక్షులు నరేంద్రనాథ్ త్రిపాఠీ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగుల మూడు ప్రధాన డిమాండ్లపై వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యలపై స్పందిస్తోందని.. అయితే తాము కూడా ప్రజలమనే విషయాన్ని పట్టించోకోకపోవడం దారుణమన్నారు. తమ డిమాండ్లపై ఎందుకు స్పందించటం లేదని సూటిగా ప్రశ్నించారు. ప్రభుత్వ ఉద్యోగులందరికీ ఆరోగ్య బీమా పథకం అమలు చేయాలని, పాత పింఛన్ బకాయిలు వెంటనే చెల్లించాలని, యోగ్యతను బట్టి వేతనాలు చెల్లించాలని కోరారు. అలాగే తక్కువ వేతనం పొందుతున్న ఉద్యోగులకు న్యాయం చేయాలని సమావేశం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది.

సమావేశంలో ఒడిశా అమలా సంఘ మాజీ కార్యదర్శి సంజయ కుమార్ పండ, ఒడిశా అమలా సంఘ కొరాపుట్ జిల్లా కార్యదర్శి జగన్నాథ్ మఝి, ఒడిశా అమలాసంఘ ఉపాధ్యక్షులు కొరాపుట్ జిల్లా శాఖ కైలాస సామంతరాయ్, ఒడిశా నాన్‌గెజిటెడ్ సంఘ సమన్వయ సమితి కొరాపుట్ జిల్లా శాఖ బారీఖ సెట్టి, వై.శ్రీనివాస రావు పాల్గొన్నారు.

పంగం నది ఒడ్డున మృతదేహం

మల్కన్‌గిరి : మల్కన్‌గిరి జిల్లా మత్తిలి సమితి కథం గూఢ పంచాయతీ గరియగూఢ గ్రామం వద్ద పంగం నది ఒడ్డున ఆదివారం మధ్యాహ్నం ఓ గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. స్థానికులు చూసి వెంటనే మత్తిలి పోలీసులకు సమాచారం అందజేశారు. మత్తిలి ఐఐసీ దీపాంజాలీ ప్రధాన్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహన్ని బయటకు తీసి పరిశీలించగా సాయంత్రానికి ఆమె వివరాలు తెలిశాయి. మృతురాలిని ఖోయిర్‌పూట్ సమితి ముదిలిపోడ పంచాయతీ కరాడబడే గ్రామానికి చెందిన బిమాల ఖోర (47)గా గుర్తించారు. ఆమె కుమారుడు గోవింధ ఖోరకు విషయం తెలిసిన వెంటనే మత్తిలి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తన తల్లి మానసికంగా ఇబ్బంది పడుతోందని, అప్పుడప్పుడూ బయటకు వెళ్లిపోతూ ఉంటుందని, రెండు రోజులుగా వెతుకుతున్నామని తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని మత్తిలి ఆరోగ్య కేంద్రానికి తరలించినట్లు ఐఐసీ తెలిపారు.


పంగం నది ఒడ్డున బిమల మృతదేహం

శిష్టకరణ సంఘం కార్యదర్శిగా వీరపట్నాయిక్


వేదికపై అతిథులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలో సీఐడీ మాల గ్రామం వద్ద గల మామిడి తోటలో ఆదివారం జిల్లా శిష్ట కరణ సంఘం సమావేశం నిర్వహించారు. కార్యదర్శిగా ఆర్.వీరపట్నాయక్‌ను ఎన్నుకుని బాధ్యతలు అప్పగించారు. ఓఎస్ అధికారిగా పనిచేస్తున్న సిద్ధార్థ పట్నాయిక్‌ను సత్కరించారు.


సిద్ధార్థ పట్నాయిక్‌కు సత్కారం

రోడ్డే కల్లం..

కొరాపుట్: వ్యవసాయ పంటలు ఎండబెట్టే (కల్లం) లేకపోతే రోడ్డే అందుకు గతి. సాధారణంగా రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులు ఎండ బెట్టడానికి రోడ్డును కొంతభాగం వినియోగించుకుంటారు. కానీ నబరంగ్‌పూర్ జిల్లా నందాహండి సమితి బి.మాలిగుడ మార్గంలో రైతులు మాత్రం రోడ్డుని పూర్తిగా ఆక్రమించుకున్నారు. ఈ ప్రాంతంలో చేతికొచ్చిన మొక్కజొన్నని రోడ్డు మొత్తం ఎండ బెట్టారు. చివరికి వాహనదారులు ఈ మార్గం గుండా వెళ్ల లేక గత్యంతరం లేని పరిస్థితిలో ప్రత్నామ్నాయ మార్గాలు ఎంచుకున్నారు.


బి.మాలిగుడ రోడ్డులో మొక్కజొన్న కండెలను ఆరబెట్టిన దృశ్యం

ఆదిత్యాలయం.. భక్తజన సంద్రం


ఇంద్రపుష్కరిణి వద్ద భక్తులు


క్యూ లైన్లలో భక్తులు

శ్రీకాకుళం అర్బన్: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో వైశాఖ మాసం సందడి కొనసాగుతోంది. మూడో ఆదివారం సందర్భంగా ఇతర ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చి ఆదిత్యునికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆరోగ్యం కోసం సూర్యనమస్కారాల పూజలు, మొక్కుల్లో భాగంగా తలనీలాలు, వైశాఖ మాస ప్రత్యేక సంప్రదాయ పూజల్లో భాగంగా గ్రామీణ మహిళల ప్రసాదాల నివేదన తదితర ప్రత్యేక పూజలు విశిష్టతతో అరసవల్లి క్షేత్రం భక్తజన సంద్రంగా మారింది. ఆలయ ఈవో వై.భద్రాజీ ఆధ్వర్యంలో క్యూ లైన్లు ఏర్పాటు చేసినప్పటికీ భారీగా భక్తులు తరలి రావడంతో ఈ సౌకర్యాలు పెద్దగా సరిపడలేదనే విమర్శలు వినిపించాయి. భానుడి ప్రతాపం తీవ్రంగా ఉండడంతో కేశఖండనశాల, ఇంద్రపుష్కరిణి పరిసరాలలో భక్తులు ఇబ్బందులు పడ్డారు. ధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అంతరాలయంలో ప్రత్యేక అలంకరణతో స్వామివారిని సర్వదర్శనాలకు అనుమతించారు.

ఒక్కరోజులోనే రూ.12,29,751 ఆదాయం

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం ఒక్క రోజు ఆదాయం రూ.12,29,751 లభించింది. టికెట్ల రూపంలో రూ.8,84,100, పూజలు, విరాళాల రూపంలో రూ.81,496, ప్రసాదాల రూపంలో రూ.2,64,155 కలిపి మొత్తంగా రూ.12,29,751 ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో యర్రంశెట్టి భద్రాజీ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ఎచ్చెర్ల: లావేరు మండలం తాళ్లవలస జాతీయ రహదారిపై ఈ నెల 10న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన సారవకోట మండలం చీడిపూడిక గ్రామానికి చెందిన షణ్ముఖరావు (30) ఆదివారం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అనకాపల్లిలో తాపీ పని కోసం ఈ నెల 10న వెళ్తుండగా తాళ్లవలస వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో షణ్ముఖరావు తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్త రిమ్స్‌కు తరలించగా మెరుగైన చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. లావేరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పశువుల తరలింపుపై కేసు నమోదు

ఎచ్చెర్ల క్యాంపస్: నవభారత్ జంక్షన్ సమీపంలో జాతీయ రహదారిపై పశువులను అక్రమంగా తరలిస్తున్న రెండు వాహనాలను ఆదివారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 12 ఆవులు, 5 గేదెలను తీసుకెళ్తుండగా వీటిని పట్టుకున్నారు. తరలిస్తున్న వ్యక్తులపై కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేశారు. అనంతరం పశువులను కొత్తవలస గో సంరక్షణ కేంద్రానికి తరలించారు.

నరహరికి ఘన సత్కారం


నరహరిని అభినందిస్తున్న సంఘం సభ్యులు

పర్లాకిమిడి: పాతపట్నం మండలం కొరసవాడకు చెందిన పల్ల నరహరికి శ్రీకాకుళం జిల్లా యాదవ సంఘం ఉపాధ్యక్షుడిగా నామినేటెడ్ పదవి దక్కినందుకు ఒడిశాలోని గజపతి జిల్లా కృష్ణ గొల్ల కుల సంఘం ఆధ్వర్యంలో పర్లాకిమిడిలో నగరం పల్లి వీధిలో ఆదివారం ఘనంగా సత్కరించారు. నరహరికి ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యక్ష పదవి ఇచ్చినందుకు ఆయన స్ఫూర్తితో గజపతి జిల్లాలో గొల్ల కుల సంఘం కూడా అభివృద్ధికి బాటలు వేస్తామని జిల్లా గొల్ల కుల సంఘం అధ్యక్షుడు ఎ.కులవర్ధనరావు అన్నారు. ఈ సన్మాన సభలో కార్యదర్శి డి.అప్పన్న, బి.తిరుపతిరావు, ఎ.శ్రీనివాసరావు, బి.సంజీవి, బుడ్డు పాల్గొన్నారు.

అధ్వానంగా గుడారి రోడ్డు



ఎన్‌ఏసీ కార్యాలయానికి వెళ్లే ప్రధాన రహదారిలోని గుంతల్లో చేరిన వర్షం నీరు

రాయగడ: జిల్లాలోని గుడారి ఎన్‌ఏసీ పరిధిలోని రోడ్లు అత్యంత దయనీయంగా మారాయి. ఎన్‌ఏసీకి వెళ్లే ప్రధాన రహదారిలో రోడ్డు పరిస్థితి అత్యంత అధ్వానంగా ఉంది. కొద్దిపాటి వర్షం కురుస్తే గుంతల్లో నీరు చేరి వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నిత్యం ఈ రహదారి గుండా సంబంధిత శాఖ అధికారులు వెళుతున్నప్పటికీ ఎవ్వరూ పట్టించుకోవడం లేదని గుడారి వాసులు ఆరోపిస్తున్నారు. అయితే కొద్ది రోజుల క్రితం ఎన్‌ఏసీ కార్యనిర్వాహక అధికారి ప్రసన్నకుమార్ పాఢి ఇక్కడ పడ్డ గుంతలను కప్పేందుకు మొరుము, కంకర వేశారు. అయితే ఇటీవల ఏకధాటిగా కురుస్తున్న వర్షాల కారణంగా రహదారి పూర్తిగా గుంతలమయమయ్యింది. ఇటువంటి తరహా రోడ్లు ఎన్‌ఏసీ పరిధిలో ఉన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఇంటర్ విద్యలో.. బదిలీల పర్వం


శ్రీకాకుళం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల

- ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, సిబ్బందికి స్థాన చలనం
- జీఓ నంబర్ 23తో మార్గదర్శకాలు విడుదల


స్పాట్ వాల్యుయేషన్‌లో నిమగ్నమైన లెక్చరర్లు

శ్రీకాకుళం న్యూకాలనీ: పాఠశాల విద్యతోపాటు ఇంటర్మీడియెట్ విద్యలోనూ బదిలీల పర్వానికి రంగం సిద్ధమైంది. ఇందుకు సంబంధించి జీఓ నంబర్ 23తో కూడిన మార్గదర్శకాలను ప్రభుత్వం తాజాగా వెల్లడించింది. ఈ నెల 22 నుంచి మే 8వ తేదీలోగా బదిలీలను పూర్తిచేసేలా ప్రణాళిక రూపొందించింది. ఒకే చోట ఐదు అకడమిక్ విద్యా సంవత్సరాలు పూర్తిచేసుకున్న ఉద్యోగులు తప్పనిసరి బదిలీ కావాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇందుకు కటాఫ్ తేదీగా 2025 మే 31గా నిర్ణయించారు. జూన్ 1 నుంచి మే 31 వరకు అకడమిక్ సంవత్సరంగా పరిగణిస్తారు. ఒక సంవత్సరంలో తొమ్మిది నెలల సర్వీసు పూర్తి చేసుకున్నా సంవత్సరంగానే లెక్కిస్తారు. బోధనేతర సిబ్బంది, లెక్చరర్ల బదిలీలను వెబ్ కౌన్సెలింగ్ ద్వారా చేపడతారు.

రిక్వెస్ట్ బదిలీలకూ ఛాన్స్..

కనీసం రెండు విద్యా సంవత్సరాలు (2023-24, 2024-25) పూర్తిచేసుకున్నవారు సైతం రిక్వెస్ట్ బదిలీలకు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. 2027 మే 31కి ముందు ఉద్యోగ విరమణ చేసే వారికి బదిలీల నుంచి మినహాయింపు ఉంటుంది. ఏవైనా చార్జీలు/విజిలెన్స్ కేసులు/పోక్సో కేసులు ఉన్న ఉద్యోగుల బదిలీ అభ్యర్థనలు పరిగణనలోకి తీసుకోరు. బదిలీల్లో దివ్యాంగ ఉద్యోగుల తీవ్రత బట్టి పాయింట్లను కేటాయించగా.. వారు కోరుకుంటేనే బదిలీలకు దరఖాస్తు చేసుకోవచ్చని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జిల్లాలో 38 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటిల్లో పనిచేస్తున్న ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు, నాన్‌టీచింగ్ సిబ్బంది కలిపి 110 మంది వరకు దరఖాస్తు చేయొచ్చని అంచనా వేస్తున్నారు. అన్ని కళాశాలల్లోనూ కనీస రెగ్యులర్ సిబ్బంది ఉండేలా పోస్టులను బ్లాక్ చేస్తారు.

పనితీరుకు పాయింట్లు..

బదిలీల్లో ప్రిన్సిపాళ్లు, జూనియర్ లెక్చరర్లకు వారి పనితీరు ఆధారిత పాయింట్లను నిర్ణయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హెచ్‌ఆర్‌ఏకు, విద్యార్థుల స్ట్రెంత్‌కు, విద్యార్థుల ఫలితాలకు వేర్వేరుగా పాయింట్లను కేటాయించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సర ఫలితాల ఆధారంగా వీరికి పాయింట్లను ఇవ్వనున్నారు. 0 నుంచి-40శాతం ఫలితాలు వస్తే ఎలాంటి పాయింట్లూ ఉండవు. 41 నుంచి 60 శాతానికి రెండు, 61-80 శాతానికి నాలుగు, 81 నుంచి 100 శాతానికి ఆరు పాయింట్ల చొప్పున ఇస్తారు. ప్రిన్సిపాళ్లకు జనరల్, వృత్తివిద్యా కోర్సులను కలిపి చూస్తారు. హెచ్‌ఎస్‌ఏ 16 శాతంతో క్యాటగిరీ – ఏలో ఉన్నవారికి కేటగిరి-బీ, సీ, డీ ప్రాంతాలకు మారేందుకు అనుమతిస్తారు. హెచ్‌ఆర్‌ఏ 12 శాతంతో క్యాటగిరీ-బీలో ఉన్నవారు క్యాటగిరీ-ఏ, బీ, సీ, డీలకు వెళ్లొచ్చు. హెచ్‌ఎస్‌ఏ 10 శాతంతో క్యాటగిరీ-సీలో ఉన్నవారు అన్ని క్యాటగిరీలకూ మారేందుకు అవకాశం ఉంటుంది.

ఎన్నో సందేహాలు..

బదిలీల పర్వానికి సంబంధించి ఎన్నో సందేహాలు, మరెన్నో చిక్కుముడులకు ఉత్తర్వుల్లో ఎక్కడా సమాధానాలు లభించలేదని ఉద్యోగులు వాపోతున్నారు. చాలా చోట్ల పోస్టులను కుదింపు, కోర్సుల రద్దు పేరిట ప్రభుత్వం ఇష్టానుసారం చేపడుతున్న రేషనలైజేషన్ తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒకవైపు బదిలీలకు దరఖాస్తు చేసుకోవడం, మరోవైపు రేషనలైజేషన్‌లో పోస్టులను మరోచోటకు కేటాయింపుతో.. సగం పోస్టులను బ్లాక్ చేస్తుండటంతో అంతా గందరగోళ పరిస్థితి నెలకొంది. ఏం చేయాలో తెలియక, మార్గదర్శకాల్లో స్పష్టత లేక లెక్చరర్లు తలలు పట్టుకుంటున్నారు.

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే..



ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఇంటర్మీడియెట్ విద్యలో బదిలీలు పారదర్శకంగా జరుగుతాయి. ఇప్పటికే మార్గదర్శకాలు వెలువడ్డాయి. ఎవరూ ఎలాంటి ఆందోళన, దిగులు చెందనవసరం లేదు. ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నవారు తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉంటుంది. ఉత్తర్వుల్లో పేర్కొన్నట్టుగా అర్హులైన ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు, సిబ్బంది త్వరితగతిన దరఖాస్తు చేసుకోవాలి. ప్రిన్సిపాళ్ల, లెక్చరర్ల పనితీరు ప్రకారం పాయింట్ల కేటాయింపు జరిగింది.

– ఆర్.సురేష్‌కుమార్, ఇంటర్మీడియెట్ విద్య జిల్లా అధికారి, శ్రీకాకుళం

నెక్కంటిపై పోరాటం కొనసాగిస్తాం

- లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు యాల్ల కొండబాబు

రాయగడ: గత నలభై ఏళ్లుగా ఏకచత్రాధిపత్యాన్ని కొనసాగిస్తూ.. ప్రజల్ని పట్టిపీడిస్తున్న రాజ్యసభ మాజీ ఎంపీ, బీజేడీ సీనియర్ నాయకుడు నెక్కంటి భాస్కరరావుపై పోరాటం కొనసాగిస్తామని లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు యాల్ల కొండబాబు అన్నారు. సదరు సమితి శిల్లిగుడ డ్యామ్ వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన బంధుమిలన్ కార్యక్రమంలో మద్దతుదారులను ఉద్దేశించి ప్రసంగించారు. రాయగడలో గత 40 ఏళ్లుగా లారీ యజమానుల సంఘం నెక్కంటి కనుచూపుల్లో నడిచేదన్నారు. ఇంతవరకు సంఘంలో ఎటువంటి అభివృద్ధి కానరాలేదన్నారు. గత రెండేళ్ల క్రితం లారీ యజమానుల సంఘాన్ని తాము చేజిక్కించుకున్న అనంతరం సంఘం తరఫున రెండేళ్లలో దాదాపు రూ.1.85 కోట్లను జమ చేయగలిగామన్నారు. నాలుగు దశాబ్దాలుగా నెక్కంటి ఒక్క రూపాయి కూడా సంఘం తరఫున ఆదాయం చూపకపోవడం ఆయన అవినీతికి అద్దం పడుతుందన్నారు. ఇకపై ఆయన ఆగడాలకు చెక్ పెట్టే సమయం ఆసన్నమైందన్నారు. లారీ యజమానులు, డ్రైవర్లు మూకుమ్మడిగా ఆయన అవినీతిపై పోరాటం చేసేందుకు సన్నహాలు చేస్తున్నామన్నారు. గత నలభై ఏళ్లలో లారీ యజమానుల సంఘానికి సంబంధించిన ఆదాయాన్ని చూపించకపోతే నెక్కంటి ఇంటి వద్ద తామంతా ఆందోళన చేపడతామని ప్రకటించారు. అమాయకులైన ఆదివాసీ, హరిజనుల పొట్టకొట్టి సంపాదించిన ప్రతీ రూపాయి తిరిగి నెక్కంటి చెల్లించే సమయం అతి దగ్గరలోనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నెక్కంటికి అతి సన్నిహితుడైన లారీ యజమాని ఆదినారాయణ కూడా కొండబాబుతో చేతులు కలిపి పోరాటానికి సిద్ధమని ప్రకటించారు. కొండబాబు పేదల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్నారని, ఆయనకు మద్దతు తెలపాలన్నారు. లారీ యజమానులు, డ్రైవర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొండబాబు

క్లుప్తంగా

కమ్మవీధిలో అగ్నిప్రమాదం

• రూ. 5.50 లక్షల ఆస్తినష్టం



దగ్ధమైన ఇళ్లు, సామగ్రి

విజయనగరం క్రైమ్: నగరంలోని కమ్మ వీధిలో ఆదివారం మధ్యాహ్నం 1 గంట ప్రాంతంలో అగ్నిప్రమాదం సంభవించింది. ఆ వీధిలోని ఒక గృహిణి ఇంట్లో దేవుడి దగ్గర దీపం పెడుతుండగా ఒక్కసారిగా అగ్గిపుల్ల పక్కకు ఒరిగి ప్రమాదం సంభవించింది. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక దళ అధికారులు సంతోష్, మహేష్ బృందం ఫైర్ ఇంజిన్‌తో కమ్మవీధిలో అగ్నిప్రమాదం జరిగిన ప్రదేశానికి చేరుకుని మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. సూబట్ల సూర్యారావు ఇంట్లో ఈ ప్రమాదం సంభవించగా రూ.లక్ష నగదు, బంగారం, ఇంట్లో ఉన్న టీవీ, బీరువా దగ్ధమయ్యాయి. అలాగే ఆ ఇంటిని ఆనుకుని ఉన్న సూబట్ల రాజు, సూబట్ల లక్ష్మణరావుల ఇళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి.

పిడుగుపాటుకు రెండు ఆవుల మృతి



బలిజిపేట: మృతి చెందిన ఆవులు

బలిజిపేట: మండలంలోని పెద్దింపేటలో పిడుగుపాటుకు రెండు ఆవులు మృతిచెందాయి. ఆదివారం మధ్యాహ్నం నుంచి ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. పెద్దింపేటలో మధ్యాహ్నం వర్షం కురిసి ఆగిపోయిన తరువాత రైతులు ఆవులను మేతకు విప్పి గ్రామం శివారుకు వెళ్తున్న సమయంలో పిడుగులు పడడంతో ఆవులు మృత్యువాత పడినట్లు గ్రామస్తులు తెలిపారు. మజ్జి కృష్ణమూర్తి, టి.సూర్యనారాయణలకు చెందిన రెండు ఆవులు మృత్యువాత పడ్డాయి. కృష్ణమూర్తి ఆవు రూ.30వేలు, సూర్యనారాయణ ఆవు రూ.40వేలు ఖరీదు ఉంటాయని గ్రామస్తులు తెలిపారు.

కుక్క కాటుతో మరో రెండు ఆవులు



పాలకొండ రూరల్: అట్టలిలో మృతి చెందిన ఓ పాడిఆవు

పాలకొండ రూరల్: మండలంలోని అట్టలి గ్రామంలో నివసిస్తున్న శిర్లి తాడమ్మ చెందిన రెండు పాడి ఆవులు పిచ్చికుక్క కాటుకు గురై ఆదివారం మృతి చెందాయి. దీంతో బాధితురాలు కన్నీటి పర్యంతమైంది. తమ కుటుంబ పోషణలో భాగమైన ఆవులను కుక్క కరిచేయడంతో అవి మృతి చెందినట్లు బాధితురాలు భోరుమంది. ఇటీవల మండలంలోని రుద్రిపేట గ్రామంలో కుక్కకాటుకు గురై ఓ లేగ దూడ మరణించిన ఘటన మరువక ముందే మరో ఆవులు చనిపోయాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో స్వైర విహారం చేస్తున్న కుక్కలపై దృష్టి పెట్టాలని ఆయా ప్రాంతాల వాసులు కోరుతున్నారు.

‘ఉగ్ర’ విచారణలో విస్తుపోయే నిజాలు!

• మూడో రోజూ కొనసాగిన విచారణ

విజయనగరం క్రైమ్: బాంబు పేలుళ్ల కుట్ర కేసులో విజయనగరం పోలీసుల కస్టడీలో ఉన్న సిరాజ్, సమీర్‌లను మూడో రోజు ఆదివారం కూడా విచారించారు. ఇందులో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చినట్లు భోగట్టా. కోర్టు ఆదేశాలతో ఎన్ఐఏ అధికారుల నుంచి తమ కస్టడీలోకి తీసుకున్న విజయనగరం పోలీసులు స్థానిక పీటీసీలో మూడో రోజు కూడా విచారణ కొనసాగించారు. రెండో రోజు శనివారం రాత్రి సిరాజ్ కాస్త అస్వస్థతకు గురవడంతో సర్వజన ఆసుపత్రి నుంచి ఇద్దరు ప్రత్యేక వైద్యాధికారులను రప్పించి పీటీసీలోనే చికిత్స చేయించినట్టు సమాచారం. తొలి రెండు రోజులు కాస్త నెమ్మదిగా దర్యాప్తు సాగించిన దర్యాప్తు బృందం అధికారులు మూడో రోజు తమదైన కోణంలో విచారణ సాగించినట్టు తెలిసింది. ముఖ్యంగా గడిచిన ఆరు నెలలుగా హైదరాబాద్‌లోనే సమీర్‌తో ఉన్న విజయనగరం వాసి సిరాజ్ అక్కడే బాంబు పేలుళ్లకు పన్నాగం పన్నినట్టు విచారణలో తేలినట్టు తెలిసింది. మానవ బాంబుగా సిద్ధమైన సిరాజ్, సమీర్‌లు ముస్లిమేతరులే లక్ష్యంగా సోషల్ మీడియా వేదికగా పేలుళ్లకు పథక రచన చేసినట్టు తెలిసింది. వరంగల్ ఫర్హాన్, ఢిల్లీ బాదర్ నుంచి వీరికి ఉన్న సంబంధాలపై కూపీ లాగుతున్నట్టు సమాచారం. మూడో రోజు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విచారణ సాగినట్టు భోగట్టా. తిరిగి సాయంత్రం 5.30 గంటలకు మొదలైన విచారణ రాత్రి వరకు కొనసాగినట్టు తెలిసింది.

హత్యా..?ఆత్మహత్యా?

- కోనాడలో అనుమానాస్పదంగా యువకుడి మృతి
- కుమారుడి మృతిపై పోలీసులకు తండ్రి ఫిర్యాదు
- శవాన్ని బయటకు తీసి పోస్ట్‌మార్టం చేసిన వైద్యులు



బొడ్డు భూలోక మృతదేహం,(ఇన్‌సెట్లో) భూలోక (ఫైల్)



అనాథలైన పిల్లలు హాసిని, రజిని

పూసపాటిరేగ: మండలంలోని కోనాడ గ్రామంలో యువకుడి మృతిపై పలుఅనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉరివేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు, గ్రామస్తులు ధ్రువీకరిస్తుండగా తమ కుమారుడిని హత్య చేశారంటూ మృతుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారణ చేసి, పూడ్చిపెట్టిన మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టం నివేదికతో యువకుడిది హత్యా? లేక ఆత్మహత్యా? అనేది తేలనుంది. ఈ సంఘటన వివరాల్లోకి వెళ్తే.. కోనాడ గ్రామానికి చెందిన బొడ్డు భూలోక (35), గ్రామానికి చెందిన బడి సూరిబాబుల మధ్య చిన్నపాటి విషయమై వాగ్వాదం జరిగింది. భూలోక తన కుమార్తె హాసినిని దుర్భాష లాడడంతో వరుసకు మేనమామ అయిన సూరిబాబు పిల్లలను ఎందుకు దుర్భాషలాడుతున్నావంటూ భూలోకను మందలించడంతో ఇద్దరి మధ్య వివాదం ప్రారంభమైంది. జరిగిన విషయాన్ని సూరిబాబు సమీపంలోని బంధువులకు చెబుతుండగా, మద్యం మత్తులో ఉన్న భూలోక వెనక నుంచి మంచం కోడుతో సూరిబాబు తలపై బలంగా మోదడంతో తీవ్ర రక్త స్రావమైంది. వెంటనే హుటాహుటిన చికిత్స నిమిత్తం సుందరపేట ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై సూరిబాబు బంధువులు బొడ్డు అశోక్, బొడ్డు చినభూలోక, బొడ్డు అప్పలస్వామిలు కోపోద్రిక్తులై రాత్రి 10 గంటల సమయంలో భూలోక ఇంటికి వెళ్లి చేయిచేసుకున్నారు. అకారణంగా సూరిబాబును ఎందుకు కొట్టావంటూ కొట్టారు. దీంతో మనస్తాపం చెందిన భూలోక నిమిషాల వ్యవధిలో రెండుసార్లు ఉరివేసుకోవడానికి ప్రయత్నించడంతో గ్రామస్తులు వారించి అడ్డుకున్నారు. అ తరువాత అర్ధరాత్రి 2 గంటల సమయంలో భూలోక, తండ్రి అప్పన్నతో కలిసి మద్యం తాగాడు. సీతంపేటలో రంపం పనికోసం ఆదివారం తెల్లవారు జామున నూకరాజు అనే కాంట్రాక్టర్ ఇంటికి వచ్చి భూలోకను పిలుస్తుండగా తలుపులు తీయకపోవడంతో గదిలో చూడగా ఉరివేసుకుని ఉన్నాడు. దీంతో ఆదివారం ఉదయం 8 గంటల సమయంలో భూలోక మృతదేహాన్ని సంప్రదాయం ప్రకారం శ్మశానంలో పూడ్చిపెట్టారు. అంత్యక్రియల అనంతరం ఇంటికి వెళ్లిన మృతుడి తండ్రి అప్పన్న తమ కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నాయని, హత్య చేశారని పూసపాటిరేగ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో రంగంలోకి దిగిన భోగాపురం రూరల్ సీఐ జి. రామకృష్ణ, పూసపాటిరేగ ఎస్సై ఐ.దుర్గాప్రసాద్‌లు కోనాడ శ్మశానానికి వెళ్లి పూడ్చిపెట్టిన మృతదేహాన్ని గ్రామస్తుల సహకారంతో బయటకు తీయించి వైద్యులతో శ్మశానంలోనే పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టం నివేదికతో బొడ్డు భూలోకది హత్యా? లేక ఆత్మహత్యా? అనే విషయం తేలనుంది.



విచారణ చేస్తున్న పోలీసులు

అనాథలైన పిల్లలు

మృతుడు భూలోక భార్య భూలోకమ్మ రెండేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. తాజాగా భూలోక మృతి చెందడంతో పిల్లలు అనాథలయ్యారు. వారికి హాసిని, రజిని అనేకుమార్తెలు, అక్షియవర్ధన్ అనే కుమారుడు ఉన్నారు. అనుకోని ప్రమాదంలో తల్లి భూలోకమ్మ, తండ్రి భూలోకలు మృతి చెందడంతో ముగ్గురు పిల్లలు అనాథలుగా మిగిలారు. సంఘటనా స్థలానికి వచ్చిన వారంతా దేవుడా ముగ్గురు పిల్లలకు దిక్కెవరంటూ కన్నీరు పెట్టుకున్నారు. బొడ్డు భూలోక మృతిపై ఫిర్యాదు మేరకు పూసపాటిరేగ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాలుగు పర్యాటక ప్రదేశాల్లో యోగా ప్రదర్శన

- 10న ఉపాధి హామీ సిబ్బందితో రాష్ట్రస్థాయి కార్యక్రమం
- కొనసాగుతున్న యోగా శిక్షణ



రాజీవ్ క్రీడామైదానంలో యోగా శిక్షణ పొందుతున్న గురువులు, మాస్టర్ ట్రైనీలు

విజయనగరం: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఒక్కరికీ యోగా గొప్పతనాన్ని వివరించి, వారి చేత యోగాసనాలను అభ్యసింపజేసే ప్రక్రియకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపడుతోంది. దీనిలో భాగంగానే ఇప్పటికే జిల్లాలో ఎంపిక చేసిన వందమంది మాస్టర్ ట్రైనీలు, టీఓటీలకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ శిక్షణ రెండో రోజు ఆదివారం రాజీవ్‌ఇండోర్ స్టేడియంలో కొనసాగింది. జిల్లా కేంద్రంలో ప్రత్యక్షంగా, హాజరుకాని వారికి ఆన్‌లైన్ ద్వారా శిక్షణ నిర్వహించారు. యోగా గురువులు, టీవోటీలు ఉత్సాహంగా శిక్షణలో పాల్గొన్నారు.

నాలుగు ప్రాంతాల్లో ప్రదర్శనలు

జిల్లాలోని నాలుగు పర్యాటక ప్రాంతాల్లో భారీస్థాయిలో యోగా ప్రదర్శించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించింది. దీని ప్రకారం ఈనెల 30న రామనారాయణం, జూన్ 6న చింతపల్లి బీచ్ వద్ద, 12న రామతీర్థం వద్ద, 19న శ్రీ గొర్రిపాటి బుచ్చి అప్పారావు తాటిపూడి రిజర్వాయర్ వద్ద యోగా ప్రదర్శనలు నిర్వహించనున్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో అంశాల ప్రాతిపదికగా ప్రతి జిల్లాకు ఒక థీమ్‌ను ప్రభుత్వం కేటాయించింది. దీనిలో భాగంగా జిల్లాలో వేలాది మంది గ్రామీణ ఉపాధి హామీ పథకం వర్కర్లతో జూన్ 10న యోగా ప్రదర్శన నిర్వహించడానికి భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.

విజయనగరంలో 10 ప్రాంతాల్లో..

జిల్లా కేంద్రం విజయనగరంలో మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పది యోగా వీధులను ఎంపిక చేశారు. రెండు రోజులకు ఒకసారి పట్టణంలోని ఏదో ఒక ప్రధాన మార్గంలో ఉదయాన్నే యోగాసన ప్రదర్శన నిర్వహిస్తారు. శిక్షణ పొందిన వారితో పాటు, సామాన్య ప్రజలు సైతం ఈ యోగా స్ట్రీట్‌కు వచ్చి ఆసనాలను అభ్యాసం చేయవచ్చు. దీనిలో భాగంగా సోమవారం ఉదయం శ్రీ పైడితల్లి అమ్మవారి ఆలయం వద్ద ప్రధాన రహదారిపై యోగా ప్రదర్శన నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు.

వైభవంగా ఆదిత్యహృదయ హోమం



యాగశాలలో ప్రత్యేక హోమాలు జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు. వేకువజామున స్వామికి ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత యాగశాలలో సుందరకాండ హవనం, గాయత్రి రామాయణం, ఆదిత్య హృదయ హోమాలను వైభవంగా జరిపించారు. అనంతరం స్వామి సన్నిధిలో సీతారాముల కల్యాణాన్ని వేడుకగా జరిపించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో అర్చకులు నరసింహాచార్యులు, కిరణ్, వరప్రసాద్, రామగోపాల్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మాస శివరాత్రి పూజలు



శివునికి పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు

నెల్లిమర్ల రూరల్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని ఉమా సదాశివాలయంలో మాస శివరాత్రి పూజలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకుడు మల్లికార్జున శర్మ ఆధ్వర్యంలో తొలుత గణపతి పూజ చేసి, అనంతరం శివునికి పంచామృతాలు, వివిధ ఫలరసాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామి సన్నిధిలో ప్రత్యేక హోమాలు చేశారు. మాస శివరాత్రి పురస్కరించుకుని భక్తులంతా ఉపవాసాలు ఆచరిస్తూ దైవదర్శనం చేసుకోవడం విశేషం. పూజల అనంతరం భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

రెండు లారీలు ఢీ కొని బిహార్ వాసి మృతి



సైలేస్ సాహూ మృతదేహం

రామభద్రపురం: మండలంలోని కొండకెంగువ వద్ద గ్రీన్‌ఫీల్డ్ హైవేపై రెండు లారీలు ఢీ కొనడంతో జరిగిన ప్రమాదంలో బిహార్ వాసి ఒకరు ఆదివారం మృతిచెందారు. ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బిహార్‌లోని పాట్నా జిల్లాకు చెందిన సైలేస్ సాహు(40) జీవనోపాధి నిమిత్తం గడిచిన మూడేళ్లుగా హెచ్‌జీ ఇన్‌ఫ్రా కంపెనీలోని కొండకెంగువ వద్ద ఏర్పాటు చేసిన క్యాంపు-1లో పనిచేస్తున్నాడు. అయితే పనినిమిత్తం పాచిపెంట వద్ద ఏర్పాటు చేసిన క్యాంపు-2కు వెళ్లి పని ముగించుకుని తిరిగి క్యాంప్-1కు లారీలో వస్తుండగా హెచ్‌జీ ఇన్‌ఫ్రా కంపెనీ నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవేపై ఆ హైవేకు సంబంధించిన మరో లారీ ఎదురుగా వస్తూ ఢీ కొంది. దీంతో సాహు ప్రయాణిస్తున్న లారీ తలుపు తెరుచుకుని కిందపడడంతో లారీ చక్రాలు, రోడ్డు పక్కనే ఉన్న డివైడర్ మధ్య నలిగి ముద్దయ్యాడు. అదే లారీలో ఉన్న డ్రైవర్ శివ ఠాకూర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించేందుకు వీలు లేనంతగా ముద్దవడంతో బాడంగి సీహెచ్‌సీ వైద్యాధికారి ఆధ్వర్యంలో ఘటనా స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించారు. డ్రైవర్ శివ ఠాకూర్ ఫిర్యాదు మేరకు ఎస్సై వి. ప్రసాదరావు కేసునమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు. మృతుడు సాహుకు భార్య, పాప, బాబు ఉన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తికి తీవ్రగాయాలు

గజపతినగరం: మండల కేంద్రంలోని రైల్వే బ్రిడ్జి సమీపంలో ట్రైన్‌లో ప్రయాణిస్తూ ఓ వ్యక్తి జారిపడి తీవ్ర గాయాలపాలయ్యాడు. గజపతినగరం రైల్వే స్టేషన్ మీదుగా విశాఖ వెళ్తున్న పాసింజర్ ట్రైన్‌లో నుంచి విజయవర్మ అనే వ్యక్తి జారి పడి తీవ్ర గాయాల పాలు కావడంతో స్థానికులు గుర్తించి ఆస్పత్రికి తరలించగా ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయనగరం మహారాజా ఆస్పత్రికి తరలించారు.

డిజిటల్ దెబ్బ..దొంగల అబ్బా..!

- సెల్‌టవర్ లొకేషన్, ఫింగర్ ప్రింట్స్ ద్వారా నిందితుల గుర్తింపు
- వైజాగ్ నుంచి జన్మభూమి రైలులో ప్రయాణించిన దుండగులు
- రెక్కీ నిర్వహించిన మహిళ కోసం గాలింపు
- తెనాలిలో ఇద్దరు దొంగలను పట్టుకున్న పోలీసులు
- వారితో పాటు మరికొంత మంది ఉన్నట్లు సమాచారం



చీపురుపల్లి: ఎంత నైపుణ్యం కలిగిన దొంగలైనా ప్రస్తుత రోజుల్లో డిజిటలైజేషన్ ముందు తలొగ్గాల్సిందే. విరివిగా దొంగతనాలు జరుగుతు న్నప్పటికీ పోలీస్‌శాఖలో పెరిగిన డిజిటలైజేషన్ కారణంగా ఆ చోరీలను ఛేదించడం సునాయాసమైంది. అందులో భాగంగానే చీపురుపల్లి పట్టణంలోని మెయిన్‌రోడ్‌లో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన చోరీతో పాటు వృద్ధులను గాయపరిచిన దుండగులు డిజిటలైజేషన్ పుణ్యమాని అతికొద్ది గంటల్లోనే పట్టుబడ్డారు. శుక్రవారం అర్ధరాత్రి పట్టణంలోని మెయిన్‌రోడ్‌లో వారణాశి సురేష్ నివాసంలో 20 తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లడంతో పాటు ఇంట్లో ఉన్న ఇద్దరు వృద్ధులను తీవ్రంగా గాయపరిచిన సంఘటన తెలిసిందే. శనివారం ఉదయానికి ఈ సంఘటన పట్టణాన్ని ఉలిక్కిపడేలా చేసింది. దీంతో రంగంలోకి దిగిన డీఎస్పీ ఎస్.రాఘవులు నేతృత్వంలోని పోలీస్ అధికారులు డిజిటలైజేషన్ సహకారంతో దుండగులను పట్టుకున్నట్లు సమాచారం. చీపురుపల్లిలో చోరీకి పాల్పడిన దొంగలను తెనాలిలో పట్టుకుని జిల్లాకు తీసుకువచ్చినట్లు తెలిసింది.

డిజిటలైజేషన్‌దే కీలకపాత్ర

దొంగలను పట్టించడంలో డిజిటలైజేషన్ కీలక పాత్ర పోషించినట్లు తెలుస్తోంది. ప్రధానంగా చోరీ జరిగిన ఇంటికి సమీపంలోని సెల్‌టవర్ పరిధిలో సమాచారాన్ని పోలీసులు సేకరించినట్లు తెలిసింది. చోరీ జరిగిన సమయంలో ఆన్‌లో ఉన్న ఫోన్ నంబర్లను సేకరించారు. దీంతో పాటు క్లూస్ బృందాలు సేకరించిన ఫింగర్ ప్రింట్స్‌తో మేచ్ అవడంతో తెనాలికి చెందిన ముఠాగా దుండగులను గుర్తించారు. వెంటనే గుంటూరు పోలీసులకు సమాచారం అందజేశారు. దీంతో తెనాలి పోలీసులు వారిని పట్టుకున్నారు. అయితే చీపురుపల్లిలో చోరీకి పాల్పడిన దుండగులు విశాఖపట్నం చేరుకుని అక్కడి నుంచి జన్మభూమి రైలులో తెనాలి వెళ్లినట్లు తెలిసింది.

రెక్కీ చేసిన మహిళ కోసం..

ఇదిలా ఉండగా చీపురుపల్లిలో జరిగిన ఉదంతానికి ప్రధాన సూత్రధారిగా ఓ మహిళ ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నట్లు సమాచారం. చోరీ జరగడానికి మూడు రోజుల ముందే ఆ మహిళ చీపురుపల్లి చేరుకుని రెక్కీ నిర్వహించి ఇక్కడి ఇల్లు, పరిసరాల ఫొటోలు దుండగులకు పంపించినట్లు తెలిసింది. ఆ మహిళ వేసిన స్కెచ్ ప్రకారమే చోరీ అమలు చేసినట్లు సమాచారం. అయితే తెనాలిలో ఇద్దరు దుండగులు మాత్రమే పట్టుబడిన నేపథ్యంలో ఆ మహిళతో పాటు మిగిలిన వారి కోసం పోలీసులు గాలిస్తున్నట్లు సమాచారం.

సన్మానం

విజయనగరం టౌన్: స్థానిక గురజాడ గ్రంథాలయం ఆవరణలో విజయభావన సాహితీ సమాఖ్య ఆధ్వర్యంలో హనుమ భక్తితత్వంపై ప్రసంగం ఇచ్చే కార్యక్రమం ఆదివారం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తాడేపల్లిగూడెం ప్రాంతానికి చెందిన తెలుగు పండితుడు పి.రామచంద్రరావు హాజరై, కాసేపు ప్రసంగించారు. దాస్య భక్తికి హనుమను గొప్ప ఉదాహరణగా చెప్పవచ్చని, సర్వదేవతా స్వరూపం హనుమంతుడని పేర్కొన్నారు. భోగ మోక్షాలకు, ఇహపరాలకు రక్ష హనుమంతుడేనన్నారు. అనంతరం ఆయనను సమాఖ్య ప్రతినిధులు సత్కరించారు.

బురదలో కూరుకుని బాలుడి మృతి



బురదలో కూరుకుపోయి మృతిచెందిన అశోక్

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని లుంబేసు పంచాయతీ మూలజమ్ము గ్రామంలో బురదలో కూరుకుపోయి ఓ బాలుడు మృతిచెందాడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బిడ్డిక చిరంజీవి, నీరజల కుమారుడు అశోక్ (7) స్నేహితులతో కలిసి గ్రామ సమీపంలోని చెరువులో ఆడుకునేందుకు శుక్రవారం వెళ్లాడు. కాసేపు చెరువులో ఉన్న నీటిలో ఆడుకున్నారు. అంతలో ఇంకొంచెం చెరువు మధ్యలోకి వెళ్లిన అశోక్ బురదలో కూరుకుపోయాడు. ఎంతకీ బయటకు రాకపోవడంతో స్నేహితులు హుటాహుటిన గ్రామానికి వెళ్లి కుటుంబసభ్యులకు తెలియజేయడంతో అంతా వచ్చి చెరువులో వెదికారు. చాలా సేపటి తర్వాత బురదలో కూరుకుపోయిన అశోక్ శవమై కనిపించాడు. ఈ సంఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

గోపాలకృష్ణ మాస్టారుకు అవార్డు ఆనందదాయకం

• ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



గోపాలకృష్ణ మాస్టారు దంపతులను దుశ్శాలువ, మెమెంటోలతో సత్కరిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, డాక్టర్ తలే రాజేష్ తదితరులు

రేగిడి: మండలంలోని అంబకండి గ్రామానికి చెందిన ఆంగ్ల ఉపాధ్యాయుడు పుర్లి గోపాల కృష్ణంనాయుడికి తెలుగు వెలుగు సాహితీవేదిక నంది అవార్డు రావడం ఆనందదాయకమని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్‌లు అన్నారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని అంబకండి గ్రామంలో గోపాలకృష్ణంనాయుడు మాస్టారును దుశ్శాలువాలు, బొకేలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంగ్ల ఉపాధ్యాయుడు అయినప్పటికీ తెలుగుభాషపై ఉన్న మక్కువతో విద్య, సాంస్కృతిక సేవా రంగంలో విశిష్టమైన కృషిచేసి అవార్డు పొందడంతో ఈ ప్రాంతానికే మంచి పేరు వచ్చిందన్నారు. భవిష్యత్తులో మరిన్ని అవార్డులు సాధించాలని మనస్ఫూర్తిగా కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, ఎంపీటీసీ పుర్లి సత్యవతి, లావేటి గణపతిరావునాయుడు, లావేటి శ్రీహరిరావు, లావేటి వెంకట వేణుగోపాలనాయుడు, ఎస్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రవాణాకు మార్గం!

• రామభద్రపురం మీదుగా నిషేధిత వస్తువుల రవాణా



అక్రమంగా తరలిస్తున్న నిషేధిత సిగరెట్లను పరిశీలిస్తున్న ఎస్సై వి.ప్రసాదరావు

రామభద్రపురం: మండలకేంద్రంలోని జాతీయ రహదారి మీదుగా నిషేధిత వస్తువుల అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. తాజాగా రూ.96 లక్షల విలువ చేసే నిషేధిత సిగరెట్లను రామభద్రపురం పంచాయతీ కార్యాయం వద్ద స్థానిక పోలీసులతో పాటు విజిలెన్స్, వాణిజ్యపనుల శాఖాధికారులు శనివారం పట్టుకున్న విషయం విదితమే. రామభద్రపురం మండల కేంద్రం అంతరరాష్ట్ర కూడలి కావడంతో పాటు ఒడిశా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు బోర్డర్‌లో ఉన్నందున ఈ మండల కేంద్రం మీదుగా గంజాయి, ఖైనీ గుట్కా, నల్లమందు వంటి మాదక ద్రవ్యాలతో నిషేధిత వస్తువులు అక్రమ రవాణా సులభతరమవుతోంది.

పదినెలల్లో అక్రమ రవాణా జరిగిన కొన్ని సంఘటనలు..

గతేడాది జూన్ 16వ తేదీన స్థానిక గాంధీ బొమ్మ సెంటర్ వద్ద ఒడిశా రాష్ట్రం కొరాపుట్ పరిసర ప్రాంతాల్లో కొనుగోలు చేసి విజయవాడకు అక్రమ రవాణా చేస్తున్న కిలోన్నర గంజాయిని పోలీసులు పట్టుకున్నారు.

- గతేడాది ఆగస్టు 16వ తేదీన కొట్టక్కి చెక్ పోస్టు వద్ద అక్రమంగా ఒడిశా నుంచి తరలిస్తున్న రెండున్న కిలోల గంజాయి పట్టుకున్నారు.
- గతేడాది అక్టోబరు 7న మండలంలోని ముచ్చర్లవలస పరిధిలో గల పెట్రోల్ బంకు సమీపంలో గల రాజస్థాన్ డాబా వద్ద ఎస్సై వి. ప్రసాదరావు సిబ్బందితో కలిసి నల్లమందు పట్టుకున్నారు
- గతేడాది డిసెంబర్ 12న కొట్టక్కి చెక్ పోస్టు వద్ద ఒడిశా నుంచి సాలూరు, రామభద్రపురం మీదుగా అక్రమంగా రవాణా అవుతున్న 800 కిలోల గంజాయి పట్టుకున్నారు.
- ఈ ఏడాది ఫిబ్రవరి 10న 150 కిలోల గంజాయి కొట్టక్కి పోలీస్ చెక్‌పోస్టు వద్ద పట్టుబడింది.

అక్రమ రవాణాపై మరింత నిఘా..



మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై మరింత నిఘా మండల బోర్డర్‌లో ఒడిశా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ ఏజెన్సీ రాష్ట్రాలు ఉడడం వల్ల మండలం మీదుగా అక్రమ రవాణా జరిగే అవకాశం ఉంది. కొట్టక్కి పోలీస్ చెక్‌పోస్టు, స్థానిక బైపాస్ రోడ్డులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా పటిష్టం చేశాం. ఏ విధమైన అక్రమ రవాణా జరగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటాం.

వి ప్రసాదరావు, ఎస్సై, రామభద్రపురం

కూటమి ప్రభుత్వం వచ్చాకే అధికంగా అక్రమ రవాణా

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మాదక ద్రవ్యాలతో పాటు పలు నాసిక రకం వస్తువుల అక్రమ రవాణాకు అడ్డూ, అదుపూ లేకుండా పోయిందని పలు విమర్శలు వినిపిస్తున్నాయి.

31న జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు



జిల్లా పోటీల బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న అధ్యక్షుడు బేబీ నాయన

బొబ్బిలి: ఈనెల 31న పట్టణంలో 18వ జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు నిర్వహించనున్నట్లు బొబ్బిలి తైక్వాండో క్లబ్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే బేబీ నాయన తెలిపారు. ఈ మేరకు ఆదివారం దీనికి సంబంధించిన బ్యానర్‌ను ఆవిష్కరించారు. క్లబ్ కార్యదర్శి చెలికాని వేణుగోపాల రావు ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీలకు జిల్లావ్యాప్తంగా 200 మంది హాజరై జూనియర్,సబ్ జూనియర్, జూనియన్ క్యాడెట్, సీనియర్ విభాగాల్లో జరిగే పోటీల్లో తలపడతారన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారు వచ్చే నెల 9 నుంచి అనంతపురం జిల్లా తాడిపత్రిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు హాజరవుతారని కోచ్ బంకురు ప్రసాద్ తెలిపారు.